సాక్షి
అన్నమయ్య జిల్లా
శనివారం । 30 । నవంబర్ । 2024



ఇస్తిమా ఏర్పాట్ల పరిశీలన

రాయచోటి పట్టణ శివారులో డిసెంబర్ 7, 8లో ముస్లింలు నిర్వహించనున్న ఇస్తిమా ఏర్పాట్లను వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి పరిశీలించారు. -8లో



ఆక్రమణల జోరు

మదనపల్లె మండలం కోళ్లబైలు పంచాయతీ పట్టణానికి సమీపంలో ఉండటంతో ప్రభుత్వ స్థలాలను టీడీపీ వర్గీయులు జోరుగా ఆక్రమించుకుంటున్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.440	రూ.520
రెండోరకం	రూ.300	రూ.420

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 99 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నేడు ముగ్గుల పోటీలు

రాయచోటి (జగదాంబసెంటర్): ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ప్రజలకు అవగాహన కోసం శనివారం స్థానిక డైట్ కళాశాలలో ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌ఓ కొండయ్య, అదనపు డీఎంహెచ్‌ఓ శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాలతో అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఎయిడ్స్ నివారణ, నియంత్రణ వారి సూచనల మేరకు పీసీఎస్ఎస్ టీఐ ఎన్‌జీఓ, ఎల్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. రాయచోటి పట్టణంలోని మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విజేతలకు ప్రథమ బహుమతి కింద రూ.1111, ద్వితీయ స్థానం రూ.777, మూడో స్థానానికి రూ.555తోపాటు సర్టిఫికెట్, మెమొంటోలు ఇవ్వనున్నట్లు వివరించారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు : 7396390632, 7569166129కు సంప్రదించాలని సూచించారు.

నూతన నియామకం


వెంకటేష్

కేవీపల్లి: గుంటూరు జిల్లా నందిగామాలో డిసెంబర్ 3 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్న జనసేవదళ్ శిక్షణా శిబిరానికి రాష్ట్ర ఇన్‌స్ట్రక్టర్‌గా మండలంలోని తిమ్మాపురానికి చెందిన ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు టి.ఎల్.వెంకటేష్‌ను నియమిస్తూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా టి.ఎల్. వెంకటేష్ మాట్లాడుతూ దేశంలో విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు జనసేవదళ్ కార్యకర్తలు ముందుండి సేవ చేయడానికి ముందుకొచ్చే విధంగా వారిని శారీరకంగానూ, మానసికంగానూ దృఢం చేసేందుకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

రేపు భగవద్గీత శ్లోకాల పోటీలు

రాజంపేట టౌన్: రాజంపేట పట్టణంలోని మన్నూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి జిల్లా స్థాయిలో భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలు నిర్వహించనున్నట్లు టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా ప్రోగ్రాం అసిస్టెంట్ టి.గోపిబాబు, ధర్మాచార్యులు గంగనపల్లె వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 11న వచ్చే గీతాజయంతిని పురస్కరించుకొని ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. 6, 7వ తరగతి విద్యార్థులకు ఒక విభాగం, 8, 9, 10వ తరగతుల వారికి ఒక విభాగంగా పోటీలు ఉంటాయన్నారు. విద్యార్థులు భగవద్గీత ఆరవ అధ్యాయం ఆత్మసంయమ యోగంలోని 47 శ్లోకాలను చెప్పాల్సి ఉంటుందన్నారు. అలాగే సంపూర్ణ భగవద్గీతపై 18 ఏళ్లలోపు వారికి జూనియర్స్ విభాగం, 18 ఏళ్లు పైబడిన వారికి సీనియర్స్ విభాగంలో పోటీలు ఉంటాయని తెలిపారు. మొత్తం నాలుగు విభాగాల్లో పోటీలు ఉంటాయని వివరించారు. ప్రతి విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఉంటాయన్నారు. అన్ని యాజమాన్య పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చని సూచించారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకుడు చంద్ర నాయక్

లక్కిరెడ్డిపల్లి: రబీలో సాగు చేసిన ప్రతి రైతు పంటను నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకుడు చంద్ర నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో లక్కిరెడ్డిపల్లి, వీరబల్లి, రామాపురం, గాలివీడు మండలాల వ్యవసాయ సిబ్బందికి జిల్లా వనరుల కేంద్రం శిక్షణ కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి, వేరుశనగ, టమాట పంటలకు సంబంధించి పంట బీమా పథకంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ జయరాణి, ఏఓలు నాగమణి, స్వాతి, సుచిత్ర, నాగరాజ్, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

డ్రిప్ పరికరాలకు 90 శాతం సబ్సిడీ


మాట్లాడుతున్న జిల్లా సూక్ష్మనీటి సాగు అధికారి వై.లక్ష్మీప్రసన్న

రాయచోటి టౌన్: రైతులకు డ్రిప్ పరికరాలు 90 శాతం సబ్సిడీతో అందిస్తున్నట్లు జిల్లా సూక్ష్మ నీటి సాగు అధికారి వై.లక్ష్మీప్రసన్న తెలిపారు. శుక్రవారం ఓదివీడు గ్రామ సచివాలయంలో సూక్ష్మనీటి అధికారులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా దరఖాస్తు చేసుకొనేందుకు అర్హత కలిగిన రైతులను సిద్ధం చేయాలని గ్రామ స్థాయి అధికారులకు సూచించారు. సంబేపల్లె ఉద్యాన అధికారి వనిత భాయ్, ఎంపీడీసీ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఐఈ గురుప్రసాద్, కృష్ణానాయక్, ఎంపీఏవో వినోద్, సాయికిరణ్ పాల్గొన్నారు.

తిరోగమనం

- వైఎస్సార్‌సీపీ పాలనలో అభివృద్ధి పరవళ్లు
- జిల్లా అయిన అనతికాలంలోనే అన్ని రకాల వసతులు
- కూటమి అధికారంలోకి వచ్చాక ఆగిన పనులు




నూతన కలెక్టరేట్ నిర్మాణానికి ఎంపిక చేసిన స్థలం (ఇన్‌సెట్) ఆగిన శిల్పారామం పనులు

సాక్షి రాయచోటి: అన్నమయ్య జిల్లాలో అభివృద్ధి తిరోగమనం దిశగా పయనిస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రారంభించిన పలు పనులకు.. కూటమి సర్కారు మోకాలడ్డటంతో ఈ పరిస్థితి నెలకొంది. నాటి వైఎస్ జగన్ సర్కారు జిల్లాల పునర్విభజనలో భాగంగా ఆరు నియోజకవర్గాలతో అన్నమయ్య జిల్లాగా మార్చి.. రాయచోటిని జిల్లా కేంద్రంగా తీర్చిదిద్దింది. అప్పటి నుంచి మౌలిక సదుపాయాల కల్పనతోపాటు ఇతర అవసరమైన అన్ని హంగులు కల్పించేలా ప్రణాళికలు రూపొందించింది. ఈ దిశగా అడుగులు ముందుకు వేసింది. దీంతో ఊహించని విధంగా జిల్లా అభివృద్ధి పరవళ్లు తొక్కింది. మొన్నటి వరకు ప్రగతిలో దూసుకుపోయిన జిల్లాకు.. ఒక్కసారిగా గ్రహణం పట్టినట్లుగా మారింది. ఐదున్నర నెలల కిందట జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అధికారంలోకి రావడం.. కొన్ని టెండర్లను రద్దు చేయడంతోపాటు మిగతా పనుల విషయంలోనూ ఏం చేస్తుందో అర్థం కాకపోవడంతో ఎక్కడికక్కడ పనులు నిలిచిపోయాయి.

ముందుకు సాగని స్టేడియం నిర్మాణం

జిల్లా కేంద్రమైన రాయచోటిలో చేపట్టిన అనేక అభివృద్ధి పనులు ఆగిపోయాయి. అందులో భాగంగా స్టేడియం నిర్మాణ పనులు దాదాపు పూర్తయినా కొంత మేర గ్యాలరీలు, చుట్టూ నీటి పైప్‌లైన్లు, ఇతర పలు పనులు పెండింగ్‌లో పడిపోయాయి. అటు సమీపంలోనే అన్ని క్రీడలకు సంబంధించిన స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులు కూడా ముందుకు సాగడం లేదు. అలాగే రాయచోటి మున్సిపాలిటీ పరిధిలో సర్కిళ్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆటోనగర్, పోలీసు ట్రైనింగ్ సెంటర్‌కు సంబంధించి స్థలాల ఎంపిక పూర్తయినా పనులు ముందుకు సాగడం లేదు. ప్రజల ఆహ్లాదానికి సంబంధించి శిల్పారామం ప్రహరీ నిర్మాణం సాగినా ఇతర పనులన్నీ పెండింగ్‌లో ఉన్నాయి. వెలిగల్లు ప్రాజెక్టుకు సంబంధించి సుందరీకరణ, గాలివీడు రోడ్డులోని నగరవనం పనులు పూర్తి స్థాయిలో చేపట్టాల్సి ఉంది. పీజీ కళాశాల, కేంద్రీయ విద్యాలయాలను ప్రారంభించాల్సి ఉంది. ఉర్దూ కళాశాల నిర్మాణం కూడా మధ్యలోనే నిలిచిపోయింది.

మదనపల్లెకు మెడికల్ కళాశాలపై నీలినీడలు

వైఎస్సార్‌సీపీ హయాంలో మదనపల్లెకు మెడికల్ కళాశాల మంజూరు చేశారు. సుమారు రూ.475 కోట్ల వ్యయంతో పనులు ప్రారంభమై నిర్మాణాలు జరుగుతున్నాయి. పనులు శరవేగంగా జరుగుతున్న సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడి కళాశాలకు సీట్లు కేటాయించకుండా మార్పు చేయడంపై ఈ ప్రాంత ప్రజలు, విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది కళాశాలకు సంబంధించి తరగతులు ప్రారంభించాలని వైఎస్సార్‌సీపీ సర్కారు సంకల్పిస్తే.. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కళాశాలను తిరోగమనంలోకి తీసుకు వెళుతోంది. బిల్లులు కూడా వస్తాయో, లేదోనన్న ఆందోళన కాంట్రాక్టర్లలో నెలకొంది.

అన్ని నియోజకవర్గాల్లో అంతే...

జిల్లా వ్యాప్తంగా రైల్వేకోడూరు, రాజంపేట, పీలేరు, తంబళ్లపల్లె, మదనపల్లె ప్రాంతాల్లో కూడా అనేక అభివృద్ధి పనులు ఆగిపోయాయి. గత వైఎస్సార్ సీపీ హయాంలో చేపట్టిన వాటికి బిల్లులు ఈ ప్రభుత్వంలో ఇస్తారో, ఇవ్వరోనన్న ఆందోళనతో ఎక్కడికక్కడ కాంట్రాక్టర్లు పనులను మందగమనం చేశారు. అనేక పనులకు సంబంధించి నిర్మాణాలు అంతంత మాత్రంగానే జరుగుతున్నాయి. ఏది ఏమైనా అభివృద్ధికి కూటమి సర్కారు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి ముందుకు వెళితే తప్ప జిల్లా తిరోగమనంలో పయనించడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు.

నాడు నిధుల వరద



అన్నమయ్య జిల్లాలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రగతి పనులకు నిధుల వర్షం కురిసింది. ముఖ్యంగా నాడు–నేడు కింద పాఠశాలల రూపురేఖలు మారాయి. రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, డిజిటల్ లైబ్రరీలు, పాల కేంద్రాలతో అన్ని ప్రాంతాలు కళకళలాడాయి. రాయచోటిలోని ప్రధాన రహదారిపై జాతీయ నాయకుల విగ్రహాలు, పట్టణంలో అందంగా పార్కుల నిర్మాణం, క్రికెట్ స్టేడియం లాంటి అభివృద్ధి పనులు అద్భుతంగా కనిపించాయి. మధ్య తరగతి ప్రజలకు అనుకూలంగా అవసరమైన ఇళ్ల నిర్మాణాల్లో భాగంగా స్థలాలు కేటాయించడం, ప్లాట్ల ఏర్పాటు, అందులో రోడ్ల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పన పూర్తి చేశారు. ఇక విద్యా సంస్థలకు స్థలాల ఎంపికతోపాటు పలు కేంద్ర విద్యా సంస్థల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు.

కలెక్టరేట్ టెండర్లు రద్దు

రాయచోటిలోని నూతన కలెక్టరేట్‌కు సంబంధించిన టెండర్లను రద్దు చేశారు. ప్రధానంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కలెక్టరేట్‌కు సుమారు 60–80 ఎకరాల మేర స్థలాన్ని రింగ్ రోడ్డు సమీపంలో ఎంపిక చేసి అక్కడ భవన నిర్మాణాలకు సుమారు రూ.100 కోట్ల మేర నిధులు మంజూరు చేశారు. అయితే తొలుత పనుల నిర్మాణానికి రూ.10 కోట్లకు టెండర్లు పిలిచి పనులు చేపట్టాలని ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పనులపై సందిగ్ధం నెలకొనడం, తర్వాత గత ప్రభుత్వంలో పిలిచిన టెండర్లను రద్దు చేశారు. అయితే తిరిగి నిధుల మంజూరు మొదలుకొని ఇతర అనుమతులు వచ్చిన తర్వాత కలెక్టరేట్‌కు టెండర్లు పిలువనున్నట్లు తెలుస్తోంది. ఎంపిక చేసిన స్థలంలోనే నూతన కలెక్టరేట్‌తోపాటు పోలీసు పరేడ్ మైదానం, జిల్లా పోలీసు కార్యాలయాలతోపాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాలతో కూడిన నూతన కలెక్టరేట్‌ను నిర్మించాలని సంకల్పించినా ప్రభుత్వం మారడంతో పనులకు బ్రేక్ పడింది. రానున్న కాలంలో ఇక్కడే నిర్మాణాలు చేపడతారా? లేక ఇతర ప్రాంతాలను పరిశీలిస్తారా? అన్నది కూడా అర్థం కావడం లేదు.

రెవెన్యూ సమస్యల పరిష్కారంపై దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి: రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తహసీల్దార్లు ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ తెలిపారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం సబ్ కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందే వినతి పత్రాలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియా దేవి, డీఆర్ఓ కె.మధుసూదన్‌రావు, రాయచోటి ఆర్డీఓ శ్రీనివాసులు, సర్వే ఏడీ భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైవీయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు సెమిస్టర్ల పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. కడప నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రాన్ని వైవీయూ వైస్ చాన్సలర్ కె. కృష్ణారెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి కే.ఎస్.వి. కృష్ణారావులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలించారు. విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణంలో పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనంతరం ఆచార్య కె.ఎస్.వి. కృష్ణారావు పెండ్లిమర్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రాన్ని తనిఖీ చేయగా, పులివెందుల లయోలా కళాశాల ను ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య తనిఖీ చేశారు. జిల్లాలోని 54 కేంద్రాలలో 1, 3, 5 సెమిస్టర్లకు సంబంధించిన 20,819 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని పరీక్షల నియంత్రణాధికారి తెలిపారు.

చిరుద్యోగులకు ఎసరు

- విద్యుత్ శాఖలో 'స్మార్ట్' కలకలం
- మీటర్ రీడర్ల కొలువుకు గండం
- బిల్ కలెక్టర్లకు చెల్లు చీటీ
- ప్రత్యామ్నాయ ఉపాధిపై హామీ ఇవ్వని ప్రభుత్వం


రాయచోటిలో ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటర్

రాయచోటి: 'మేము అధికారంలోకి వస్తే లక్షలాది మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలిస్తాం.. ఉపాధి కల్పిస్తాం' అని ఊకదంపుడు ప్రసంగాలు చేసి ప్రజలను నమ్మించి కూటమి అధికారంలోకి వచ్చింది. తీరా ఇప్పుడు తీసుకుంటున్న నిర్ణయాలతో కొత్త ఉద్యోగాల సంగతి దేవుడెరుగు.. ఉపాధి నిస్తూ వస్తున్న చిన్నపాటి ఉద్యోగాలకు సైతం ఎసరు పెట్టి లక్షలాది మందిని నిరుద్యోగులుగా మార్చి రోడ్డున పడేస్తోంది. ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ ఒక్క అన్నమయ్య జిల్లా నుంచే 8528 మంది గ్రామ, వార్డు వలంటీర్ల కొలువులకు చరమగీతం పాడింది. నేడు స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో 350 మంది మీటర్ రీడర్లను తొలగించేందుకు రంగం సిద్ధం చేసింది. గత వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టడంతో.. పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో వెనక్కి తగ్గింది. వైఎస్‌ఆర్‌సీపీ అధికారం కోల్పోవడానికి స్మార్ట్ మీటర్లు కూడా ఓ కారణమైందనే వాదన ఉంది. నాడు విమర్శలు గుప్పించిన కూటమి నేడు స్మార్ట్ వైపే అడుగులు వేస్తుండటంపై మీటర్ల రీడర్లు, కార్మిక సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తొలిదశలో ప్రభుత్వ కార్యాలయాలకు బిగింపు ప్రక్రియ పూర్తి చేశారు. రెండో దశగా కేటగిరీ –2 కింద జిల్లా పరిధిలోని కమర్షియల్ వినియోగదారులకు వీటిని అమర్చే పనులు చురుగ్గా సాగుతున్నాయి. వీటి ఏర్పాటుపై వామపక్షాలు ఉద్యమాలు సైతం చేస్తున్నాయి. వీటి ఏర్పాటును వినియోగదారులు వ్యతిరేకిస్తుండగా.. సంస్థలోని మీటర్ రీడర్లు, బిల్ కలెక్టర్ల ఉపాధికి గండిపడి రోడ్డు పాలు కానున్నారు.

ఆన్‌లైన్‌లో మీటర్ రీడింగ్

ప్రస్తుతం విద్యుత్ శాఖలో మీటర్ రీడర్లు వినియోగదారుల గృహాలకు వెళ్లి.. ఆ నెలలో వాడిన యూనిట్ల వివరాలు నమోదు చేసుకుని బిల్లులు మంజూరు చేస్తారు. జిల్లాలోని ఎస్పీడీసీఎల్, ఈపీడీసీఎల్ డిస్కంల పరిధిలో వీరు పని చేయాల్సి ఉంటుంది. సుమారు 350 మందికి పైగా మీటర్ రీడర్లు పని చేస్తున్నారు. వీరికి ఇంధన శాఖ పీస్‌రేట్ ప్రకారం వేతనాలు చెల్లిస్తోంది. అంటే వారికి కేటాయించిన గృహాల సర్వీసుల సంఖ్య ప్రకారం ఒక్కో సర్వీస్‌కు రూ. 3.50 ఇస్తారు. అంటే ఒక్కొక్క మీటర్ రీడర్‌కు వారి సర్వీసుల ప్రకారం సుమారు 5 నుంచి 10 వేల రూపాయల వరకు వేతనం అందుతుంది. వారిని కనీసం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులుగా సైతం గుర్తించకపోవడంతో వీరికి ఇంధన శాఖ నుంచి ఎటువంటి అదనపు సౌకర్యాలు వర్తించవు. పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలకు సైతం నోచుకోలేదు. కనీస వేతనం ప్రశ్నే వీరి దరిచేరదు. అయినా ఎప్పటికైనా తమను కనీసం కాంట్రాక్ట్ కార్మికులుగానైనా గుర్తిస్తారన్న ఆశతో బతుకుబండిని లాగిస్తున్నారు. వీరికి నెలలో మొదటి పది రోజులే పని ఉంటుంది. మిగిలిన రోజుల్లో విద్యుత్ శాఖాధికారులు వీరిని ఇతర సేవలకు వినియోగించుకుంటున్నా.. ఎటువంటి జీతాలు ఇవ్వడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

ఏజెంట్ల దోపిడీ

మీటర్ రీడర్లను సరఫరా చేసే ఏజెన్సీలు, కాంట్రాక్ట్ వ్యవస్థలు వీరి శ్రమను దోపిడీ చేస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. వీరికొచ్చే వేతనాల్లో ఒక్కో సర్వీసుకు 0.50 పైసల చొప్పున కమీషన్లు వసూళ్లు చేస్తున్నట్లు సమాచారం. వచ్చే 5 నుంచి 10 వేల రూపాయల్లో కమీషన్లకే ఒక వంతు చెల్లించుకోవాల్సి వస్తోందని రీడర్లు వాపోతున్నారు. ఇంత జరుగుతున్నా కార్మిక చట్టాలు ఏవీ వీరికి వర్తించకపోవడంతో వీరి సాధక బాధలు పట్టించుకునే నాథుడే కరువయ్యారన్న విమర్శలు ఉన్నాయి.


ఉద్యమాలకు సన్నద్ధం

ప్రభుత్వం తాజాగా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడంతో ఇక మీటర్ రీడర్ల అవసరం విద్యుత్ శాఖకు ఉండదు. ఈ మీటర్లు ప్రీపెయిడ్, పోస్ట్ పెయిడ్ పద్ధతుల్లో వినియోగదారులే నేరుగా రీచార్జ్ చేయించుకునే సౌలభ్యం ఉంది. దీంతో డబ్బులు అయిపోగానే విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. ప్రత్యేకంగా మీటర్ రీడరు వచ్చి బిల్లులు మంజూరు చేయాల్సిన అవసరం ఉండదు. ఈ నేపథ్యంలో రెండు జిల్లాల వ్యాప్తంగా ఉన్న 350 మంది ఉద్యోగ భద్రత ప్రశ్నార్థకమైంది. భవిష్యత్ ఆందోళన కార్యక్రమాలకు వీరు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

డిజిటల్ పేమెంట్లతో..


విద్యుత్ శాఖలో ఎప్పటి నుంచో ఉన్న బిల్ కలెక్టర్ల వ్యవస్థ కూడా కనుమరుగు కానుంది. స్మార్ట్ మీటర్లతో బిల్లులు మంజూరు చేసే అవసరం ఉండదు. మీటర్లలో రీడింగ్ వినియోగదారుడే చూసుకుని రీచార్జ్ చేయించుకుంటే సరిపోతుంది. ఈ నేపథ్యంలో బిల్లులు లేకపోవడంతో.. అవి తీసుకువచ్చి కౌంటర్లలో చెల్లించే అవకాశం ఉండదు. దీంతో ఎన్నో ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న బిల్లు కలెక్టర్లు ఇకపై కనుమరుగు కావాల్సి వస్తోంది. డిజిటల్ పేమెంట్ల వల్ల వినియోగదారుల సంఖ్య తగ్గిపోవడంతో వీరికి నెలకు కేవలం రూ.12 వేలు మాత్రమే వస్తున్నాయి. విధి నిర్వహణలో భాగంగా పలు దూర ప్రాంతాలకు వెళ్లి బిల్లులు వసూలు చేస్తున్నా.. కనీసం టీఏ, డీఏలు కూడా ఇవ్వని పరిస్థితి ఏర్పడింది.

ప్రత్యామ్నాయం చూపించండి



గ్రామాలు తిరుగుతూ విద్యుత్ మీటర్ రీడింగ్ తీసి, బిల్లులు వసూలు చేస్తాం. పల్లెల్లో ఎటువంటి వసతులు ఉండవు. పల్లెల్లో ఉన్న చెట్టు కింద కూర్చుని పని చేయాల్సి ఉంటుంది. చాలీ చాలని జీతాలతో సతమతమవుతున్నాం. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో బిల్ కలెక్టర్ల ఉపాధికి గండికొట్టవద్దు. 20 ఏళ్లుగా ఇదే పని చేస్తున్న వారు ఉన్నారు. ఉన్న ఫలంగా ఉద్యోగం పోతే రోడ్డున పడాల్సిందే. ప్రభుత్వం ఇతర ఉపాధి మార్గాలు చూపాల్సిన అవసరం ఉంది. – సనావుల్లా, మీటర్ రీడర్, రాయచోటి

విధుల్లోనే కొనసాగించాలి



స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో మీటర్ రీడర్లు, బిల్లు కలెక్టర్లు ఉపాధి కోల్పోతున్నారు. వీరికి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలపై అధికారులు ఇప్పటి వరకు ఎటువంటి ఉత్తర్వులు ఇవ్వలేదు. వీరికి కనీసం కార్మిక చట్టాలు సైతం అమలు చేయడం లేదు. నిర్దిష్టంగా హామీ ఇచ్చి వారిని విధుల్లోనే కొనసాగించాలి. – రామాంజులు, సీఐటీయూ, అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి, రాయచోటి



వేడుకగా లక్ష దీపోత్సవం


శివపార్వతుల కల్యాణోత్సవం


ప్రసంగిస్తున్న స్వస్వరూపానందగిరి స్వామి

బి.కొత్తకోట: కార్తిక మాసం పురస్కరించుకుని ఏటా బి.కొత్తకోటలో నిర్వహించే లక్ష దీపోత్సవంతో ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడింది. శుక్రవారం రాత్రి స్థానిక పీటీఎం రోడ్డుపై లక్ష దీపోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. రోడ్డుపై వేసిన బల్లలపై మట్టి దీపాలు సిద్ధం చేయగా.. అశేషంగా హాజరైన మహిళలు భక్తిశ్రద్ధలతో వెలిగించి ప్రార్థనలు చేశారు. మహిళలందరూ ఒకేసారి దీపాలు వెలిగించడంతో ఈ ప్రాంతమంతా వెలుగుతో ధగధగలాడింది. దీపాలతో శివలింగం, త్రిశూలం ఆకారంతో వెలిగించడం విశేషంగా ఆకట్టుకుంది. అరకిలోమీటరు దూరం వరకు దీపాలు వెలిగించగా, కార్యక్రమాన్ని తిలకించడం కోసం వందలాది మంది ప్రజలు తరలివచ్చారు. దీపోత్సవానికి ముందు వేదికపై శివపార్వతుల కల్యాణోత్సవం కనుల పండువగా సాగింది. ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన శ్రీనివాసమంగాపురానికి చెందిన స్వస్వరూపానందగిరి స్వామి భక్తులనుద్దేశించి ప్రసంగించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. శ్రీమహావిష్ణు సేన నిర్వహించిన ఈ కార్యక్రమానికి కమిషనర్ పల్లవి హాజరవగా సీఐ రాజారెడ్డి బందోబస్తు నిర్వహించి స్వయంగా పర్యవేక్షించారు.

క్లుప్తంగా

మెడికల్ కాలేజ్ ఏఓ మృతి



ఏఓ పుల్లంరాజు (ఫైల్)

మదనపల్లె : మదనపల్లె సర్వజన బోధనాసుపత్రి అడ్మినిస్ట్రేటివ్ అధికారి పుల్లంరాజు (55) గుండెపోటుతో గురువారం రాత్రి మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఏప్రిల్‌లో రాయచోటి నుంచి మదనపల్లె మెడికల్ కాలేజీ ఏఓగా బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (హంస) జిల్లా అధ్యక్షుడిగా పుల్లంరాజు పనిచేస్తున్నారు. రెండురోజుల నుంచి శ్వాస సంబంధిత సమస్యలతో అనారోగ్యానికి గురై కడపలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుండెపోటుకు గురై మృతి చెందాడు. కాగా, ఆయన స్వగ్రామం సంబేపల్లె. భార్య రాజ్యలక్ష్మి, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ఆత్మహత్య యత్నానికి పాల్పడిన దివ్యాంగుడు..

సుండుపల్లె : మండల కేంద్రానికి సమీపంలోని దిగువ గుల్లావాండ్లపల్లెలో ఆసాది విష్ణువర్ధన్ (22) అనే దివ్యాంగుడు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య యత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా.. ఆసాది విష్ణువర్ధన్ నాలుగు రోజుల క్రితం కుటుంబ సభ్యులు ఎవరూ ఇంట్లోలేని సమయంలో పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. గమనించిన చుట్టుపక్కల వారు మంటలను ఆర్పి హుటాహుటిన రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్సకోసం తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎం శ్రీనివాసులు తెలిపారు.

బైక్ చోరీ ఘటనపై కేసు

ములకలచెరువు : బైక్ చోరీ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గాయత్రి శుక్రవారం తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు... కర్ణాటక రాష్ట్రం చేలూరికి చెందిన పకీర్‌సాబ్ గురువారం రాత్రి స్థానిక రైల్వే స్టేషన్ వద్ద తన బైక్ పెట్టి బంధువుల ఇంటికి వెళ్లాడు. గుర్తు తెలియని దుండగులు బైక్‌ను అపహరించుకొని వెళ్లారు. ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

కోళ్లబైలులో ఆక్రమణల జోరు

- కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలాలు కబ్జా
- నిర్మాణాలు చేస్తుంటే పట్టించుకోని రెవెన్యూ అధికారులు
- స్థానికులు అడ్డుకుంటే ఎమ్మెల్యే చెప్పాడంటూ బెదిరింపులు
- పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం



ఇందిరమ్మకాలనీ కమ్యూనల్ పర్పస్ స్థలంలో అక్రమ నిర్మాణాలు

మదనపల్లె : కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడమే ఆలస్యం...తెలుగు తమ్ముళ్లు ఆదాయవనరులపై దృష్టి సారించారు. ఇసుక దోపిడీతో పాటుగా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించడమే పనిగా పెట్టుకున్నారు. కొండలు, గుట్టలను జేసీబీలతో చదునుచేస్తూ, ఇష్టారాజ్యంగా ఆక్రమించుకోవడమే కాకుండా గుడి, బడి స్థలాలను సైతం వదిలిపెట్టకుండా కబ్జాలకు పాల్పడుతున్నారు. మండలంలోని కోళ్లబైలు పంచాయతీ పట్టణానికి ఆనుకుని ఉండటం, ఎటుచూసినా ప్రభుత్వస్థలాలే ఉండటంతో టీడీపీ వర్గీయులు ఉపాధికి అడ్డాగా మార్చుకున్నారు. తాజాగా కోళ్లబైలు ఇందిరమ్మ కాలనీ ఫేజ్–2లోని సర్వేనెం.616/3లో కమ్యూనల్ పర్పస్ కోసం కొంత స్థలం వదిలిపెట్టారు. ఇందులో అక్కడి కాలనీవాసులు బ్రహ్మంగారి గుడి నిర్మించి, నాగలరాళ్లు ప్రతిష్టించారు. ఆలయానికి ఆనుకుని వేప, రాగి, నేరేడు చెట్లను నాటి వాటికి పూజలు చేసేవారు. ఆలయ నిర్మాణ స్థలం పోనూ, పక్కన మరి కొంత స్థలం ఖాళీగా ఉండేది. ఈ స్థలంపై కన్నేసిన తెలుగుతమ్ముళ్లు జేసీబీ తీసుకువచ్చి వేప, రాగి, నేరేడు చెట్లను వేళ్లతో సహా పెకిలించి భూమిని చదును చేశారు. స్థానికులు గుడి స్థలాన్ని ఆక్రమించడంపై ఆగ్రహంతో నిలదీస్తే ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, మమ్మల్ని కట్టుకోమని అనుమతిచ్చాడని, మీకేమైనా ఇబ్బంది ఉంటే అక్కడ తేల్చుకోండంటూ బెదిరింపులకు గురిచేశారు. దీంతో స్థానికులు వీఆర్వో, తహసీల్దార్, సబ్ కలెక్టర్, చివరాఖరుకు రాయచోటిలో ప్రతి సోమవారం జరిగే ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు కమ్యూనల్ పర్పస్ స్థల ఆక్రమణపై ఫిర్యాదుచేశారు. అయితే కబ్జారాయుళ్లకు ఎమ్మెల్యే అండ ఉండటంతో, రెవెన్యూ అధికారులు సైతం నిర్మాణాలపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడుతున్నారు. దీంతో తమ్ముళ్లు కోళ్లబైలు పంచాయతీలో ఎక్కడ ఖాళీస్థలం కనిపించినా, జేసీబీలతో చదునుచేయించి, ప్లాట్ల చొప్పున అమ్మడం మొదలు పెట్టారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 5 నెలల్లోనే, ఒకో ప్లాటు రూ.8–10 లక్షల చొప్పున, 25 ప్లాట్లు వరకు విక్రయాలు జరిపి, కోట్ల రూపాయలు వెనకేసుకున్నారు. కోళ్లబైలు పంచాయతీలో ఆక్రమణలపై స్థానికంగా ఉన్నటువంటి కొందరు యువకులు సామాజిక మాధ్యమాల్లో ఆక్రమణలపై విస్తృతంగా పోస్టులు పెట్టడం చేశారు. అయినప్పటికీ అధికారుల్లో ఉలుకూ పలుకులేదు. పీజీఆర్‌ఎస్ ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి పెడతామన్న జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్ కోళ్లబైలు ఆక్రమణలపై దృష్టిసారించి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపిస్తే తెలుగుతమ్ముళ్ల ఆక్రమణలు వెలుగుచూస్తాయని స్థానికులు వేడుకుంటున్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

– ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె : నియోజకవర్గంలో ప్రభుత్వభూములను ఆక్రమిస్తే కఠినచర్యలు తప్పవని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. శుక్రవారం మండలంలోని కోళ్లబైలు పంచాయతీలో ఇతరుల ఆక్రమణలో ఉన్న 10 ఎకరాల ప్రభుత్వ భూమిని, రెవెన్యూ అధికారులు గుర్తించారు. దీంతో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, క్షేత్రస్థాయిలో, అధికారులతో కలిసి వెళ్లి భూమికి సంబంధించిన రెవెన్యూ రికార్డులను, ఎఫ్‌ఎంబీ మ్యాపులను పరిశీలించారు. స్థానికులు, కోళ్లబైలు సర్వేనెం. 603, 604 లోని ప్రభుత్వస్థలంపై తనకు సమాచారం ఇచ్చారన్నారు. దీంతో రెవెన్యూ, మండల అధికారులను రికార్డులు పరిశీలించి, తేల్చాల్సిందిగా ఆదేశిస్తే, ప్రభుత్వభూమిగా నిర్ధారించారన్నారు. ప్రస్తుతానికి 5 ఎకరాల ప్రభుత్వభూమిలో లేఅవుట్ వేయించి, ఇళ్లు లేని 150 మంది పేదలకు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తాజ్‌మస్రూర్, హౌసింగ్ ఏఈ దీనదయాళ్‌రాజు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ స్థల ఆక్రమణదారులకు తాఖీదులు

గాలివీడు : రోడ్లు భవనాల శాఖ స్థలంలో రేకుల షెడ్లు ఏర్పాటు చేసిన వారికి తాఖీదులు అందించినట్లు తహసీల్దార్ భాగ్యలత పేర్కొన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ నోటీసుల్లో పేర్లు ఉన్న వారు గడువులోపు స్వచ్ఛందంగా రేకుల షెడ్లను తొలగించాలన్నారు. లేనిపక్షంలో ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత తీసుకుని రేకుల షెడ్లను తొలగించి ఆర్‌అండ్‌బీ స్థలాన్ని స్వాధీనం చేసుకోనున్నట్లు తెలిపారు.

వడ్డెర్లకు రాజ్యసభ సీటు కేటాయించాలని డిమాండ్



మాట్లాడుతున్న జీవానందం

రాయచోటి అర్బన్ : రాష్ట్రంలో ఇటీవల ఖాళీ అయిన మూడు రాజ్యసభ స్థానాలలో ఒక స్థానం వడ్డెర్లకు కేటాయించాలని ఏపీ వడ్డెర మేధావుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ కె.జీవానందం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాగళంలో చంద్రబాబు, యువగళంలో లోకేష్ వడ్డెర్లకు చట్ట సభలలో ప్రాధాన్యత ఇస్తామని ఇచ్చిన హామీని నిలుపుకోవాలని కోరారు. సమావేశంలో సంఘం నేతలు రవీంద్రబాబు, మారుతి ప్రసాద్, సాయిక్రిష్ణ, లోకేశ్వర తదితరులు పాల్గొన్నారు.

2న జిల్లాస్థాయి కబడ్డీ ఎంపికలు

కడప స్పోర్ట్స్ : వీరపునాయునిపల్లె మండలం పాయసంపల్లె గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో డిసెంబర్ 2వ తేదీ ఉదయం 11 గంటలకు ఉమ్మడి వైఎస్‌ఆర్ కడప జిల్లాస్థాయి బాలబాలికల కబడ్డీ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ సంఘంఅధ్యక్ష, కార్యదర్శులు రవీంద్రారెడ్డి, ఆర్.వి. సుబ్బయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 20 సంవత్సరాలలోపు వయసు కలిగిన బాలబాలికలు, 65 నుంచి 70కేజీల లోపు బరువు ఉన్న క్రీడాకారులు ఎంపికలకు హాజరుకావాలని సూచించారు.

'బ్రౌన్' జయంతి, వర్ధంతిని ప్రభుత్వమే నిర్వహించాలి

– ముఖ్యమంత్రికి బహిరంగ లేఖ

కడప కల్చరల్ : తెలుగుభాష రక్షకుడు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ జయంతి, వర్ధంతిని ప్రభుత్వమే నిర్వహించాలని కడపలోని బ్రౌన్ గ్రంథాలయం సలహామండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాసిన లేఖను పత్రికలకు విడుదల చేశారు. తెలుగుభాష ఉనికికి ప్రమాదం ఏర్పడిన సందర్భంగా తన జీతం, జీవితాన్ని భాషోద్ధరణకు అంకితం చేసిన చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ కడప నగరాన్ని కార్యస్థానంగా చేసుకుని తెలుగుభాషను రక్షించడమే కాకుండా భావితరాలకు అందేలా తగిన జాగ్రత్తలు తీసుకున్నారని ఆయన వివరించారు. ఆయన స్మారకంగా ప్రస్తుతం కడప నగరంలో సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం వెలసిందని తెలిపారు.

సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు

దళిత ఫోరం జిల్లా చైర్మన్ బూసిపాటి కిషోర్

కడప కార్పొరేషన్ : సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదవుతున్నాయి. కేసుల్లో ఎస్టీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని ప్రయోగించడం శోచనీయమని దళిత ఫోరం జిల్లా చైర్మెన్ బూసిపాటి కిశోర్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితులను పావులుగా వాడుకుంటున్న కొంత మంది రాజకీయ నాయకుల తప్పుడు బుద్ధితోనే ఇలాంటి కేసులు నమోదవుతున్నాయన్నారు. సోషల్ మీడియా కార్యకర్తలపై నమోదవుతున్న కేసులకు, కేసులు పెడుతున్న దళితులకు ఏం సంబంధం ఉందని ప్రశ్నించారు. ఎంతో సమున్నత లక్ష్యంతో తీసుకువచ్చిన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం రాజకీయ నాయకుల తప్పుడు విధానాలతో ఇప్పటికే నీరుగారిందన్నారు. అట్రాసిటీ చట్టం ఇంకా నీరు గారితే ఇక దళితులను ఎవరూ రక్షించలేరని ఆందోళన వ్యక్తం చేశారు. దళితుల్లో రాజకీయ చిచ్చు రేపింది చంద్రబాబునాయుడేనని, రాజకీయ లబ్ధి కోసం సోషల్ మీడియా కార్యకర్తలపై కేసులు నమోదు చేసేందుకు దళితులను వాడుకుంటున్నారని విమర్శించారు. చంద్రబాబు స్వార్థ రాజకీయాలకు దళితులు తలొగ్గరాదని తెలిపారు. గత ప్రభుత్వంలో ఇంటిపట్టా వచ్చినందుకు గీతాంజలి అనే దళితురాలు సోషల్ మీడియాలో సంతోషం వ్యక్త చేసినందుకు ఆమెపై అసభ్యంగా పోస్టులు పెట్టారని, ఆ అవమానాన్ని భరించలేక ఆత్మహత్య చేసుకుందని గుర్తు చేశారు. ఆరునెలలైనా ఇప్పటి వరకూ నిందితులను అరెస్ట్ చేయలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ చట్టం పటిష్టంగా ఉండి ఉంటే నిందితులకు ఈపాటికి శిక్ష పడేదన్నారు. దళితుల రక్షణ కోసం ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం వచ్చిందని, అది రాజకీయ పావుగా మారితే నష్టపోయేది దళితులేనన్నారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని నీరుగార్చాలని చూస్తే కడప నుంచే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలకు శ్రీకారం తిడతామని హెచ్చరించారు. సమావేశంలో అఖిలభారత అంబేడ్కర్ సేన ఏపీ రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యుడు డాక్టర్ పి పెంచలయ్య పాల్గొన్నారు.

ఇస్తిమా ఏర్పాట్ల పరిశీలన



ఇస్తిమా ఏర్పాట్లను పరిశీలిస్తున్న వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి

వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి/చిన్నమండెం : డిసెంబర్ 7, 8వ తేదీలలో రాయచోటి పట్టణ శివార్లలో ముస్లిం సోదరులు నిర్వహించనున్న ఇస్తిమా ఏర్పాట్లను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, కౌన్సిలర్లు, మైనార్టీ నాయకులతో కలిసి వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి పరిశీలించారు. ఇస్తిమా నిర్వహణ ఏర్పాట్లపై మత గురువులతో ఆయన చర్చించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ రెండు రోజుల పాటు రాయచోటి పట్టణంలోని మదనపల్లి రహదారి మార్గంలోని గొర్లముదివీడు క్రాస్ సమీపంలో అత్యంత పవిత్రంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఇస్తిమా కార్యక్రమానికి దాదాపు ఒకటన్నర లక్షల మంది వచ్చేలా ఏర్పాట్లు చేస్తుండటం అభినందనీయం అన్నారు. ప్రపంచ మానవాళికి శాంతి కలగాలని, ప్రతి ఒక్కరికీ అల్లా కరుణా కటాక్షాలు ఉండాలని ఆకాంక్షించారు. ఇస్తిమా కార్యక్రమానికి తన వంతు సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ ఫయాజుర్‌రెహమాన్, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్‌ఖాన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొలిమి హరూన్‌బాషా, కౌన్సిలర్లు కొలిమి చాన్‌బాషా, గౌస్‌ఖాన్, అల్తాఫ్, రౌనక్, వండాడి సర్పంచ్ ముసలిరెడ్డి, జాకీర్, ఫయాజ్‌అహమ్మద్, అన్నాసలీం, మజా కోఆప్షన్ జాఫర్‌అలీఖాన్, జీఎండీ ఇర్షాద్, నవాజ్, యూసుఫ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి



మృతి చెందిన సూర్యనారాయణ

మదనపల్లె : మదనపల్లె సర్వజన బోధనాసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం వృద్ధుడు మృతి చెందాడు. పట్టణంలోని పూలవీధికి చెందిన నర్సింహులు కుమారుడు సూర్యనారాయణ(70) ఈనెల 23న అనీమియాతో బాధపడుతూ స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చేరాడు. ఆయన వెంట ఎవరూ లేకపోవడంతో బంధువు వినతిమేరకు ఆస్పత్రిలో చేర్చుకున్నారు. ఐసీయూ విభాగంలో చికిత్స అందిస్తుండగా శుక్రవారం పరిస్థితి విషమించి మృతి చెందాడు. సంబంధీకులకు ఫోన్ ద్వారా సమాచారం అందించినా స్పందించకపోవడంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తి..



మృతి చెందిన రంగనాథ్

కేవీపల్లె : ప్రమాదవశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని నారమాకులపల్లె వద్ద చోటు చేసుకుంది. వివరాలిలావున్నాయి. కాకినాడకు చెందిన రంగనాథ్ (54) గత పదేళ్లుగా పీలేరులో ఒంటరిగా నివాసిస్తూ వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. శుక్రవారం కలెక్షన్ల నిమిత్తం పీలేరు నుంచి గర్నిమిట్టకు ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. అయితే మార్గం మధ్యలో నారమాకులపల్లె వద్ద అడవిపందులు అడ్డు రావడంతో ద్విచక్రవాహనం అదుపుతప్పింది రోడ్డుపై పడ్డాడు. తలకు బలమైన గాయమై కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న అతడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్యకు యత్నించిన మహిళ ..

మదనపల్లె : అనారోగ్య కారణాలతో ఆత్మహత్యకు యత్నించిన మహిళ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. మండలంలోని పెంచుపాడు పంచాయతీ బొంగావారిపల్లెకు చెందిన లక్ష్మణ్ భార్య నిర్మల(44) అనారోగ్య కారణాలతో ఈనెల 24న ఇంటివద్దే పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్సల అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి నిర్మల మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మాజీ సర్పంచ్‌పై కక్ష సాధింపు.. కేసు నమోదు

ఓబులవారిపల్లె : చిన్నఓరంపాడు మాజీ సర్పంచ్, వైఎస్సార్ పార్టీ నాయకుడు ముక్కా రమేష్ కుమార్‌రెడ్డిపై తెలుగుదేశం పార్టీ నాయకులు అధికారులపై ఒత్తిడి చేసి కక్షసాధింపు కేసు నమోదు చేయించారు. వివరాలిలా.. చిన్నఓరంపాడు పంచాయతీలోని ఎన్టీఆర్ సుజలస్రవంతి వాటర్ ప్లాంట్ మాజీ సర్పంచ్ ముక్కా రమేష్ కుమార్‌రెడ్డి అదీనంలో ఉంది. టీడీపీ అధికారంలోకి రావడంతో పంచాయతీ కార్యదర్శి సువర్ణకుమారి ప్లాంట్‌ను పంచాయతీకి స్వాధీనం చేయాలని పలుమార్లు చెప్పారు. నోటీసు ఇవ్వాలని రమేష్ కుమార్‌రెడ్డి కోరారు. గురువారం టీడీపీ నాయకురాలు ముక్కా వరలక్ష్మి , గ్రామసర్పంచ్ చెప్పడం ద్వారా వాటర్‌ప్లాంట్ పంచాయతీకి స్వాధీనం చేయాలని పంచాయతీ సీల్ సంతకంతో సువర్ణ కుమారి తన చేతితో స్వయంగా రమేష్ కుమార్‌రెడ్డికి నోటీసు జారీ చేసింది. సాయంత్రం ఎంపీడీఓ కార్యాలయంలో ఉండగా ఎంపీడీఓ సమక్షంలో రమేష్ కుమార్‌రెడ్డి తన విధులకు ఆటంకం కలిగిస్తున్నాడని, తనకు ప్రాణహాని ఉందని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ మహేష్ గురువారం రాత్రి కేసు నమోదు చేసి శుక్రవారం ఉదయం రమేష్‌రెడ్డిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఆర్థిక ఇబ్బందులతో బేల్దారి ఆత్మహత్య

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని ఆర్ట్స్‌కాలేజీ రోడ్డుకు చెందిన నాగేంద్ర (23) ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నాగేంద్ర బేల్దారి పనికి వెళ్తుంటాడు. అయితే అతను కొన్ని రోజుల నుంచి ఆర్థిక పరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. దీనికి తోడు అనారోగ్య సమస్యలు చుట్టుముట్టాయి. మనస్తాపం చెందిన అతను శుక్రవారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

రాజకీయ కక్షతో ఉద్యోగాల నుంచి తొలగించారు

- చట్టపరంగా పోరాడి న్యాయం జరిగేలా చూస్తాం
- ఎంపీ మిథున్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల



ఎంపీ మిథున్‌రెడ్డికి సమస్యలను వివరిస్తున్న ఏపీఎండీసీ బాధితులు

రైల్వేకోడూరు అర్బన్ : ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా రాజకీయ కక్షతో ఏపీఎండీసీలో పనిచేసే ఉద్యోగులను ఈ ప్రభుత్వం తొలగించింది. ఉద్యోగాలు కోల్పోయిన ప్రతి ఒక్కరికీ చట్టపరంగా పోరాడి న్యాయం జరిగేలా చూస్తామని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం తిరుపతిలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఏపీఎండీసీ బాధిత ఉద్యోగులు 300 మంది ఎంపీని కలిసి వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో స్థానికంగా ఉండే వారికి ఉద్యోగాలు కల్పించాలనే ఉద్దేశంతో ఏపీఎండీసీలో ఉపాధి కల్పించామన్నారు. చంద్రబాబునాయుడు అధికారం చేపట్టాక రాజకీయ కక్షతో ఏపీఎండీసీ ఉద్యోగులను తొలగించడం దారుణమన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ సమస్యను పార్లమెంట్ ముందు పెడతామన్నారు. ప్రతి ఒక్కరికీ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఏపీఎండీసీలో స్థానికతకు ప్రాధాన్యం ఇస్తూ ఇక్కడి చదువుకొన్న యువతకు మేము ఉద్యోగాలు ఇస్తే చంద్రబాబు తొలగించడం అన్యాయమన్నారు. రాజకీయాలలో ఇది మంచి పరిణామం కాదన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఇలా చేస్తే ఉద్యోగులు, యువతలో అభద్రతా భావం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి, ఆర్వీ రమణ, సిద్దయ్య, రౌఫ్ తదితరులు పాల్గొన్నారు.

యువతే దేశానికి బలమైన శక్తి



రామాపురం : మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



చిన్నమండెం కేజీబీవీ పాఠశాల విద్యార్థినులతో మాట్లాడుతున్న మంత్రి

- డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి
- రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి
- వైభవంగా యువజనోత్సవాలు
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రామాపురం : యువత దేశానికి బలమైన శక్తి.. అన్ని రంగాలలో ముందుండి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో జిల్లా యువజనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి ఒక కల ఉంటుందని, వారి కలను నిరూపించుకోవడానికి ఇలాంటి యువజన ఉత్సవాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అన్నమయ్య నూతన జిల్లాలో యువజన ఉత్సవాలు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. యువత మంచి మార్గాన్ని ఎన్నుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

యువత రక్తదానం చేయాలి

సమాజంలో ప్రమాదాలు జరుగుతూ కొన్ని సమయాలలో రక్తం దొరకక ఎందరో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అలాంటి వారందరికీ యువత రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలన్నారు. ప్రతి ఒక్కరూ సంవత్సరానికి ఒక్కసారైన రక్తదానం చేయాలన్నారు. అనంతరం మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండల పరిధిలోని బి ట్స్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద రాష్ట్ర విభిన్న ప్రతిభా వంతుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.వీరారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధ శ్రీను, కడప జిల్లా విభిన్న ప్రతిభావంతుల ఉపాధ్యక్షుడు బి.దామోదర్ రెడ్డి తమ సమస్యల పరిష్కారానికి మంత్రికి వినతి పత్రాన్ని అందించారు. స్టెప్ సీఈఓ సాయిగ్రేస్, బిట్స్ కళాశాల కరస్పాండెంట్ భాస్కర్, ప్రిన్సిపాల్ సీఎస్‌రెడ్డి పాల్గొన్నారు.

బాల్యవివాహాల నివారణపై అవగాహన కల్పించాలి

రాయచోటి అర్బన్ : బాల్యవివాహాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని రాష్ట్ర రవాణ, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఫయాజ్ ఫంక్షన్‌హాల్‌లో స్త్రీ,శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కిషోర్ వికాసం కార్యక్రమం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమన్నారు.

మెరుగైన విద్యను అందించాలి

చిన్నమండెం : విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని దేవగుడిపల్లె కేజీబీవీ పాఠశాలను మంత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వసతిగృహాలలో ఉండే విద్యార్థులను ఉపాధ్యాయులు, వార్డెన్లు తమ కన్న బిడ్డల్లా చూసుకోవాలన్నారు. విద్యార్థులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి పాఠశాలలో కంప్లైంట్ బాక్సులు ఏర్పాటు చేయాలన్నారు. కేజీబీవీ పాఠశాలలో శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి మంత్రి నూతన బోరును ప్రారంభించారు. అంతకు మునుపు బోరెడ్డిగారిపల్లెలోని తన నివాసంలో ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.